


## బోయ /వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

**ప్రజాశక్తి హుకుంపేట:-** కూటమి ప్రభుత్వంబోయ /వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి టి.కౌసల్యాచ ఎస్.హైమవతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపుతామని బిసి సంక్షేమ శాఖ మంత్రి ప్రకటించడాన్ని ఖండించారు. బోయ/వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలన్న నిర్ణయాన్ని కుటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీవో 03కి చట్టబద్ధత కల్పించాలని, గిరిజన ప్రత్యేక డీఎస్సీ వెంటనే ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి గిరిజన జాబితాలో బోయ/వాల్మీకులను చేర్చకుండా ప్రభుత్వమే తీర్మానం చేయాలన్నారు. నిజమైన గిరిజనుల హక్కులు, చట్టాలు జోలికొస్తే ఊరుకునేది లేదని వారు స్పష్టం చేశారు. గిరిజనులంతా ఏకమై కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని వారు హెచ్చరించారు.

### ఏకలవ్య పాఠశాలకు భూములిచ్చిన..

# గిరిజన రైతులకు ఉపాధి కల్పించాలి

### -మంత్రి సంధ్యారాణికి జెడ్‌పిటిసి గంగరాజు వినతి



మంత్రి సంధ్యారాణికి సమస్యలు విన్నవిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

**ప్రజాశక్తి -అనంతగిరి:**అనంతగిరి మండలంలోని పాతకోటలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి భూముల కేటాయించిన పాతకోట బాధిత రైతులకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి. సంధ్యారాణికి మన్యం జిల్లా సాలూరు తన నివాసం వద్ద ఆదివారం అనంతగిరి జడ్పిటిసి దీసరి. గంగరాజు బాధిత రైతులతో కలిసి విన్నవించారు. సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, ఉప సర్పంచ్ పి.అర్జున్‌లతో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం జడ్పిటిసి దీసరి గంగరాజు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణితో మాట్లాడుతూ, అనంతగిరి మండల కేంద్రం పరిధిలో అనుకూలమైన ప్రభుత్వ భూములు లేకపోవడంతో

2020-21 సంవత్సరంలో అనంతగిరి పంచాయితీ పాతకోట గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఏడుగురు గిరిజన రైతు సాగులో ఉన్న సుమారు 15 ఎకరల జిరాయితి భూములు ఇచ్చారన్నారు. అప్పటి జిల్లా అధికారులు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, రెవెన్యూ అధికారులు పాఠశాల నిర్మాణానికి భూములు ఇస్తే అందులో నాన్ టీచింగ్ లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారన్నారు. భావి తరాల పిల్లల భవిష్యత్తు కోసం తమ భూములను పాఠశాల నిర్మాణానికి ఇవ్వడం జరిగిందని, ఉపాధి కల్పించక పోవడంతో జీవనం కోల్పోయారన్నారు. అనంతరం అనంతగిరి మండలంలో సమస్యలు వివరించారు. మారుమూల గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు కల్పించాలని, ఎగువశోభ పంచాయితీ మరదగుడ కాఫీ ప్లాంటేషన్ నుండి జాముగుడ మీదుగా ఎగువశోభ పంచాయితీ కేంద్రానికి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. లంగుపర్తి పంచాయితీ ఒనుకొండ నుండి గడ్డిబంద మీదుగా పినకోట పంచాయితీ కేంద్రం వరకు రోడ్డు నిర్మించాలన్నారు. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య పాఠశాలకు భూములు ఇచ్చిన రైతులు నందుల. దొన్ను, చిట్టం.భీమన్న, చిట్టం అప్పలరాజు, పాంగి కొండప్ప, చిట్టం చిన గాసి, వెంకటరావు, సింహాద్రి, ఆనంద్ కుమార్, గిరిజన సంఘం నాయకులు సురేష్ బాబు, కొర్ర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సురేంద్ర

## బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

### -ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

**ప్రజాశక్తి - పెదబయలు :**మండలంలో మత్యగెడ్డ నాటు పడవ ప్రమాదంలో మరణించిన కొర్ర వేణు గోపాల స్వామి కుటుంబీకులను ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా అధ్యక్షులు ఎస్,దర్మన్నాపడల్, మండల కార్యదర్శి జంపరంగి సునీల్ కుమార్, సీఐటీయూ నాయకులు చెండా రామారావులు పరామర్శించారు. సీతగుంటలో బాధిత కుటుంబాన్ని అదివా రం పరామర్శించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ , పడవ ప్రమాదంలో మరణించిన కొర్ర వేణుగోపాల్ స్వామి కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. మత్యగెడ్డలో ప్రభుత్వం స్టీమర్ బోట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

### రేఖపల్లిలో మహిళల ఆందోళన



నిరసన నినాదాలు చేస్తున్న మహిళలు

**ప్రజాశక్తి-విఆర్.పురం:** రేఖపల్లి పంచాయతీ కేంద్రంలో సాయిబాబా గుడి ప్రార్ధన మందిరం, పిహెచ్‌సిలున్న ప్రధాన రహదారిలో జనావాసాల మధ్య ఇరుకైన ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానిక మహిళలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైసిపి హయాంలో అదే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయగా, ప్రజలు ఎంతగా మొరపెట్టుకున్నప్పటికీ, అప్పట్లో అధికారులుగానీ, ప్రభుత్వంగానీ పట్టించుకోలేదన్నారు. దీంతో అటుగా వెళ్లేప్రజలు, ముఖ్యంగా మహిళలు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుడు అదే ప్రాంతంలో మళ్లీ మద్యం దుకాణం ఏర్పాటు చేసి, పాతకష్టాలను కొనసాగించాలన్న చర్యలపైస్థానిక మహిళలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనూ అప్పటి కష్టాలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు, నేతలు తగు చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. మద్యం దుకాణాన్ని జనావాసాలకు దూరంగా ఊరు చివర ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

# పర్యాటక కేంద్రాల్లో.. పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ

### -ప్రజాశక్తితో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బి.లవరాజు



**ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బి.లవరాజు వెల్లడించారు. అల్లూరి జిల్లా గ్రామపంచాయతీ అధికారిగా నియమితులై ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పారిశుద్ధ్య మెరుగుకు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే..**

**పారిశుధ్యం మెరుగునకు చర్యలేమిటి?**

ఏజెన్సీలోని పర్యాటక కేంద్రాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నాం. ముఖ్యంగా ఏజెన్సీలో ఎక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగంతో పారిశుద్ధ్య సమస్యకు ప్రధాన కారణంగా ఉంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ తదితర ప్లాస్టిక్ వేస్టేజ్ చెత్త పేరుకు పోయింది. పర్యాటక స్థలాల్లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలే పారిశుద్ధ్య సమస్యకు దారి తీస్తోంది. దీని దృష్ట్యా పర్యాటక కేంద్రాల్లో ఎంట్రీ పాయింట్ వద్ద తనిఖీలు నిర్వహించడం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం నిషేధించడం, తద్వారా పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం..

**ప్రతి శుక్రవారం డ్రైడే, శ్రమదానం అమలు**

ఏజెన్సీలో ఏపీడిమిక్ దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం డ్రై డే, శ్రమదానం కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో ఈ శానిటేషన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 7100 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి వీటిని క్రమబద్ధంగా క్లోరినేషన్ నిర్వహిస్తున్నాం.




**వ్యాపారులతో సమావేశాలు**

గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో శానిటేషన్ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక కృషి చేస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు అవగాహన కల్పించడానికి మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయనున్నాం. ముఖ్యంగా వ్యాపారులు తమ షాపుల ముందు సొంతంగా డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేసుకోవడం ప్రతిరోజు చెత్త తొలగించే చర్యలు చేపట్టనున్నాం. కూడలి ప్రాంతాలు, దుకాణ సముదాయాల వద్ద చెత్త పేరుకు పోకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం.

**క్లాప్ మిత్రల జీతాల చెల్లింపులు?**

గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న క్లాప్ మిత్రల బకాయి జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకొని పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య పనులను క్రమబద్ధీకరిం చేందుకు జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదించనున్నాం. అల్లూరి జిల్లాలోని గ్రామపంచాయతీలో 899 మంది క్లాప్ మిత్రలను నియమించగా ప్రస్తుతం 646 మంది మాత్రమే పని చేస్తున్నారు. వీరికి నెలకు 6000 చొప్పున పంచాయతీల నుంచి జీతభత్యాలు చెల్లించబడుతున్నాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ శ్రేడ్డర్స్ పలుచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకుంటాం.

## బూదరాళ్ల రోడ్డు బురదమయం

### రాకపోకలకు ప్రజలు, వాహనదారుల అవస్థలు



బురదమయంగా ఉన్న బూదరాళ్ల రహదారి

**ప్రజాశక్తి -కొయ్యూరు :** మండలంలోని బూదరాళ్ల పంచాయతీలోని బాలరేవుల, లోయలపాలెం రహదారి బురదమయం కావడంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు..ఈ రహదారి గుండా నూకరాయితోట, పోకలపాలెం, గోధుమ లంక, చీడిపల్లి, వంతమర్రి, కన్నవరం, పిట్టలపాడు, గరిమండ, గరికబంద, నల్లబెల్లి బొడ్డుమామిడి, పోతవరం, రాజులుపాడు, పాములాయి గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. బురదమయమైన ఈ రోడ్డులో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండగా, వాహనాలపై వెళ్లాలంటే పెద్ద వాహనాలను కూరుకుపోతుండగా, బైక్‌లు స్కిడ్ అవుతున్నాయని, దీంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉందనిగిరిజన ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారి సమస్యను పరిష్కరించాలని గిరిజన ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

## రహదారి మంజూరుకు కృషి

### - పాడేరు శాసనసభ్యులు విశ్వేశ్వరరాజు

**ప్రజాశక్తి - చింతపల్లి:** కిటుముల పంచాయతీలోని చీమలపాడు గ్రామంలో 300 మీటర్ల సిమెంటు రహదారి మంజూరుకు కృషి చేస్తానని పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆదివారం బోడ కొండమ్మ తల్లి ఆలయం వద్దకు వచ్చిన ఆయనకు చీమలపాడు గ్రామస్తులు గ్రామంలో నెలకొని ఉన్న రహదారి సమస్యపై వినతి పత్రం సమర్పించారు. తమ గ్రామంలో 300 మీటర్ల సిమెంట్ రహదారి నిర్మాణం కాకపోవడంతో పలు ఇబ్బందులు పడుతునామన్నారు. తమ గ్రామం నుండి బూసులు కోట వెళ్లే బీటీ రహదారి నుండి 300 మీటర్ల సిమెంటు రహదారి నిర్మాణం కొరకు గ్రామ సభలలో ఎన్నిసార్లు తీర్మానాలు చేసి అధికారులకు సమర్పించినా నేటి వరకు స్పందన లేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా తమ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, సిమెంటు రహదారి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

### ఐఒసి అధికారుల ఆదేశాల మేరకు

## గ్యాస్ పైపుల మార్పునకు చర్యలు

**ప్రజాశక్తి-పాడేరు :** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారుల ఆదేశాల మేరకు గ్యాస్ పైపులు మార్పులు చేయడం జరుగుతుందని ఐటిడిఏ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 14 ,15 తేదీలలో ఐఒసి అధికారులు ఐటీడీఏ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసి ఐదేళ్లు పైబడిన గ్యాస్ పైపులను మార్చాలని మార్చకపోతే గ్యాస్ పైపులు పగిలిపోయి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారని చెప్పారు. ఈ మేరకు వంట గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ పైపులు మార్చుకోవాలని సూచించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఐదేళ్లు పైబడిన గ్యాస్ పైపులు జీవితకాలం ముగియడంతో వినియోగదారులకు సూచనలు చేస్తున్నామన్నారు. ఐటిడిఏ పరిధిలో సుమారు18000 గ్యాస్ వినియోగదారులు ఉన్నారని , 9000 గ్యాస్ కనెక్షన్లకు మొదటి దశలో గ్యాస్ పైపులు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్యాస్ కనెక్షన్ వినియోగదారులు ఐరిష్ ఈ కేవైసీ వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఉచిత గ్యాస్ పంపిణీకి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. గ్యాస్ పైప్ మార్పునకు రు.190 లు మాత్రమే తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. గ్యాస్ పైపులు తప్పనిసరిగా తీసుకోవాలని వినియోగదారులపై ఒత్తిడి చేయడం లేదని పేర్కొన్నారు. ఈ నెలకు గ్యాస్ పైపులు మార్పు ప్రక్రియ పూర్తిచేయాలని వినియోదారులకు సూచిస్తున్నామని స్పష్టం చేశారు.

# గిరిజన హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం



జీడిగుప్పలో నినదిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

**ప్రజాశక్తి-విఆర్.పురం:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలు, హక్కులను కాలరాస్తూ అన్యాయం చేస్తున్నారని, వాటి పరిరక్షణకు గిరిజనులంతా భవిష్యత్ పోరాటానికి సన్నద్ధంగా ఉండాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోయం చిన్నబాబు, కారం సత్తిబాబు, కొండరెడ్ల సంఘం అధక్షుడు కనకారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పెద్దమటపల్లి, జీడిగుప్ప గ్రామంలో నిర్వహించిన సంఘం జనరల్‌బాడీ సమావేశంలో గిరిజన యువతకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిఒ 3 రద్దుతో గిరిజన యువతకు దక్కాల్సిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను గిరిజనేతరులు తన్నుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో దాని ప్రయోజనాలను కొనసాగించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో దీని చట్టబద్ధతకు కృషి చేద్దామన్నారు. 1/70, పెసా, అటవీ భూముల సంరక్షణ చట్టం వంటివి ఏజెన్సీలో అమలు కావడం లేదని, రెండు దశాబ్దాలు గడిచినా అటవీ హక్కుల చట్టం ద్వారా పోడుభూములకు సాగుహక్కులు గిరిజనులకు దక్కడం లేదన్నారు ఎన్నికల్లో ఇచ్చిన గిరిజన ప్రత్యేక మెగా డిఎస్‌సి, ఇతర హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని, వీటి సాధనకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై పెద్దమట్టపల్లి, జీడుగుప్ప గిరిజనులు, యువత స్పందిస్తూ, ఆదివాసీ హక్కుల పరిరక్షణకు జరిపే ఉద్యమంలో తాము భాగస్వాములమౌతామని హామీ నిచ్చారు. సమావేశంలో పండ వెంకటేశ్వర్లు, చందు, కొండారెడ్డి, గిరిజన సంఘం, కొండ రెడ్ల సంఘం యువత, గిరిజన యువకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**జిఒ3 అమలు చేయాలి.**

**చింతూరు :** జిఒ3 ప్రయోజనాలు పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కల్లేరు గ్రామస్తులు కోరారు. ఆదివారం కల్లేరులో నిర్వహించిన సమావేశంలో జిఒ3ను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు. ఏజెన్సీలో 100శాతం ఉద్యోగాలను గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమావేశంలో గ్రామ పెద్దలు పొడియం నారాయణ, సోడి పోద్దయ్య, సోడి రెడ్డి, సోడి రాఘవయ్య, కుంజా నారాయణ, సోడి మురళి, ఆదివాసీయువకులు సోడి పెంటయ్య, సవలం కోటేశ్వరరావు, సోడి రాజు, జోడి వీరస్వామి, సోడి ప్రసాద్, సోడి రాజు, సోయం జోగయ్య, కోల శేషయ్య పాల్గొన్నారు.



నినదిస్తున్న కల్లేరు గిరిజనులు

## 22న రేఖపల్లి సమావేశానికి తరలిరండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నిరుద్యోగ యువత

**విఆర్ పురం:** ఈనెల 22న రేఖపల్లి ఎఎస్‌డిఎస్ కార్యాలయంలో ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి, జిఒ 3 పునరుద్ధరణకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివాసీ నిరుద్యోగ మండల యువత వెల్లడించారు. ఈసమావేశానికి అన్ని రాజకీయ పార్టీలు, గిరిజన ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు, నిరుద్యోగ యువత హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సిఎం చంద్రబాబు అరకులోయ సభలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై సలహాలు, సూచనలు చేయాలని కోరారు దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివాసీ నిరుద్యోగ యువత సోడి చందు, పులి అశోక్, గౌతమ్, విశ్వంత్, ముత్యాలు, జయరాజు, బాబీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మూగజీవాలు బలి

### - 15 ఆవులు, ఒక మేక మృత్యువాత



పిడుగుపాటుకు చనిపోయిన ఆవులు, మేక

**ప్రజాశక్తి -కొయ్యూరు :** మండలంలోని మఠం భీమవరం పంచాయతీలోని మండపల్లి గ్రామానికి చెందిన 9 మంది గ్రామస్తుల 15 ఆవులు, ఒక మేక పిడుగుపాటుకు బలయ్యాయి. మూగజీవాలను మేత కోసం కొండపైకి తీసుకెళ్లగా, మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పిడుగులతో వర్షం పడింది. దీంతో ఆవులన్నీ ఒక చెట్టు కిందకు చేరగా, అదే సమయంలో పిడుగు పడడంతో 15 ఆవులు ఒక మేక అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటూ కన్నీరుమున్నీరయ్యారు. అధికారులు స్పందించి, ప్రభుత్వపరంగా తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## పది రోజులుగా అంధకారంలోనే..

### విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంపై బొజ్జరాయిగూడెం గిరిజనుల ఆగ్రహం



బొజ్జరాయిగూడెంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

**ప్రజాశక్తి - కూనవరం:** పది రోజుల క్రితం కురిసిన గాలీవానకు రేగులపాడు పంచాయతీ బొజ్జరాయిగూడెం గ్రామంలో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి, సరఫరా లేక 20 కుటుంబాలు అంధకారంలో మగ్గుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు మండిపడ్డారు. విద్యుత్‌స్తంభాలు పడిపోయిన రోజునే సంబంధిత అధికారులకు సమాచారమివ్వడం తోపాటు నాటి నుంచి ప్రతిరోజూ విద్యుత్‌శాఖ అధికారులను కలుస్తూ గుర్తుచేస్తున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కూనవరం మండల కేంద్రంలోగానీ, ఇంకా ఏ ఇతర ప్రాంతాల్లో ఇలాగే జరిగితే అధికారులు ఇలానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని ప్రశించారు. గిరిజనులమనే చిన్నచూపుతో తమ కరెంట్ కష్టాలను పట్టించుకోవడం లేదని సర్పంచ్ రామారావుతోపాటు బొజ్జరాయిగూడెం గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనిపై జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

## అటవీశాఖ జూనియర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



చింతూరు డివిజన్ అటవీ ఆఫీసర్ల కార్యవర్గం

**ప్రజాశక్తి -చింతూరు. :** అటవీశాఖ జూనియర్ ఆఫీసర్స్ అసోసియేషన్ చింతూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. 2025-27 సంవత్సరాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ జూనియర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. లెనిన్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్ లక్ష్మణ్, రాజమండ్రి సర్కిల్ ప్రతినిధి జె..ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ఇ.సాయి వెంకటరమణ, ఉపాధ్యక్షునిగా రాధ, జనరల్ సెక్రెటరీగా జి.చిన్న భిక్షం, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎం చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీగా రాందాస్, జాయింట్ ట్రెజరర్ పి సుధీర్‌లను కమిటీ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పొంచివున్న ప్రమాదం

**-శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు**

**- పట్టించుకోని అధికారులు**



బోటు షికారు చేస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -అనంతగిరి:**మండలంలోని పైనంపాడు పంచాయతీ పరిధి ఎగువసోవళ గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. గ్రామంలో 20 స్తంభాలు పైగా ఉండగా పది స్తంభాల అడుగు భాగాన రంధ్రాలు ఏర్పడ్డాయి. స్తంభాలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నప్పటికి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఇవి ఏ క్షణం కూలి పోతాయోనన్న భయంతో గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వర్షాలకు స్తంభాల్లో విద్యుత్ సరఫరా అవుతుందని గ్రామస్తులు తెలిపారు. గత ఏడాది మేక విద్యుత్ షాక్‌తో మృతి చెందిందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త స్తంభాలు అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## డైట్ బిల్లులు మంజూరు చేయాలి

**ప్రజాశక్తి-అనంతగిరి రూరల్:**డైట్ బిల్లులు సకాలంలో మంజూరు చేయాలని వసతి గృహల నిర్వాహకులు కోరారు. ఆదివారం మండలం లో ఉన్న వసతి గృహల నిర్వాహకులు విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థులకు మెనూకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయక పోవడం తో హాస్టల్స్ నిర్వహణ కష్టంగా మారిందని వాపోయారు ఆవేదన వ్యక్తం చేశారు. నెలకో రకమైన జీఓ ను జారీ చేస్తుండడంతో బిల్లులు పెట్టుకోవడానికి కూడా ఇబ్బంది గా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మెనూ అమలు చేయాలని చెప్తున్నారని, మరో వైపు బిల్లులు మంజూరు చేయడంలో అలస్యం చేస్తుండడంతో వసతి గృహల నిర్వహణకు అప్పులు చేయాలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డైట్ బిల్లులను నెలనెల వచ్చేలా చర్యలు చేపట్టాలని వార్డెన్లు కోరుతున్నారు.



బోటు షికారు చేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

## తాజంగిలో ఎమ్మెల్యే బోటు షికారు


**చింతపల్లి :-** పర్యాటక ప్రాంతానికి ప్రసిద్ధిగాంచిన ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి, తాజంగి జలాశయంలో బోటు షికారు పర్యాటకులకు ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన తాజంగి జలాశయంలో బోటు షికారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులు తాజంగి జలాశయం అందాలను తిలకించి బోటు షికారు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. మంచి ఆదాయాన్ని అందిస్తున్న బోటు షికారు సేవలు పెంచి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఐటీడీఏ అధికారులతో మాట్లాడి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## భూ కేటాయింపుల రద్దుపై హర్షం

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** శారదాపీఠం భూములను వెనక్కి తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయం పై నర్సీపట్నం విదసం ఐక్యవేదిక హర్షం వ్యక్తం చేశారు. సీఐటీయు కాపొండ్ సమీపంలో ఆదివారం ఐక్యవేదిక చీఫ్ అడ్వైజర్ ఎల్. యల్లాజీ మాట్లాడుతూ, భూములను వెనక్కి తీసుకునే ప్రక్రియ త్వరిత గతిన ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం విదసం నాయకులు ఫ్రాన్సిస్, మట్ల అప్పారావు, మల్లేశ్ పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రాలకు పోటెత్తిన సందర్శకులు

**కనువిందు చేస్తున్న సన్ రైజ్ ప్రాంతం**



సన్ రైజ్ ప్రాంతం

**ప్రజాశక్తి - అరకులోయ :**పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో అరకులోయ పరిసర ప్రాంతంలోని పర్యాటక సందర్శిత ప్రాంతాలు కలకలలాడుతున్నాయి. మొన్నటివరకు అరకులోయలోని గిరిజన సంస్కృతి మ్యూజియం, పద్మాపురం ఉద్యానవన కేంద్రం, బొర్రా గుహలు, డుంబ్రిగూడ చాపరాయి జలపాతం, అనంతగిరి, సుంకరమెట్ట కాఫీ తోటలకు పరిమితమైన పర్యాటకులు ఇప్పుడు ఇటీవల వెలుగులోకి వచ్చిన మాడగడ పంచాయతీ కేంద్రం సమీపంలోని సన్ రైజ్ పాయింట్‌కు తరలివస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా ఉదయం నాలుగు గంటల నుంచి 9 గంటల వరకు ప్రతిరోజు సందడి నెలకొంటుంది. సన్ రైజ్ ప్రాంతం ఎత్తైన కొండలు ఉండడంతో పైనుంచి వీక్షిస్తున్న పర్యాటకులు పాల సముద్రాన్ని తలపించే విధంగా ఉన్న వెండిమబ్బులు, పర్యాటకులను ఎంతగానో కనువిందు చేస్తున్నాయి. దీంతో పర్యాటకులు ఆనందంలో ఉత్సాహంగా గడపడమే గిరిజన సంప్రదాయ వస్త్రధారణ ధరించి థింసా నృత్యం వేస్తూ అనుభూతిని లోనవుతున్నారు. ఆహ్లాదపరిచే ప్రకృతి అందాలు మెండుగా ఉండడంతో పర్యాటకుల ఆనందానికి హద్దు లే కరువైంది.

మాడగడ సన్‌రైజ్ పాయింట్‌ను సందర్శించే పర్యాటకులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆ పంచాయతీ సర్పంచ్ పాడి బారికి జ్యోతి అవసరమైన చర్యలు చేపట్టారు.అరకులోయ సందర్శించే ప్రతి పర్యాటకుడు రాత్రి నైట్ ట్రైన్ కు అరకులోయ చేరుకొని ఉదయాన్నే మాడగడ సన్ రైజ్ పాయింట్ కు వెళ్లి అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించి అనుభూతిని లోనవుతున్నారు. వంజంగి మాదిరిగా మంచు అందాలు ఇక్కడ దర్శనమిస్తుండటంతో ప్రతిరోజు ఉదయం వేళలో వందల సంఖ్యలో పర్యాటకులు ఆ సమయానికి చేరుకొని వీక్షిస్తున్నారు.

**ప్లాస్టిక్ నిషేధం**

మాడగడ సన్‌సెట్ పాయింట్ కు వెళ్లే పర్యాటకులు ప్లాస్టిక్ వస్తువులు కవర్లు వాటర్ బాటిళ్లు ఎవరు కూడా తీసుకొని వెళ్లే వద్దని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు కలగడమే కాకుండా, స్థానికులకు, పర్యాటకులకు తీవ్ర అసౌకర్యంగా మారుతుందన్నారు. ప్లాస్టిక్ తిని పశువులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయని ఆమె అన్నారు. ప్లాస్టిక్ రహిత సన్ రైజ్ పాయింట్ చేయాలన్నదే తమ లక్ష్యమని ఆమె అన్నారు. దీనికి పర్యాటకులు సహకరించాలని ఆమె అన్నారు.



సన్‌రైజ్ ప్రాంతాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు

## అందుబాటులోకి ఓఎన్‌డిసి ఉత్పత్తులు

**ప్రజాశక్తి -కోటఉరట్ల:**గ్రామీణ ప్రాంతాల నుండి సైతం అమెజాన్ వంటి సంస్థలతో పోటీగా ఓఎన్‌డిసి ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి తెలిపారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలో వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఓఎన్‌డిసి ఉత్పత్తుల వివరాలను సిసి లను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌జి సంఘాల వారు అత్యధికంగా ఆహార తయారీ ఉత్పత్తులతో పాటు దీర్ఘకాలికంగా కాల పరిమితి ఎక్కువగా ఉండే ఉత్పత్తులు తయారీ పట్ల దృష్టి సారించాలన్నారు. ఆన్లైన్ ద్వారా అమ్మకాలు చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 1277 ఎస్‌హెచ్‌జి సంఘాల ద్వారా పలు ఉత్పత్తులు మండలం నుండి 52 సంఘాల ద్వారా వివిధ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. 2024-25 కు గాను మ్యాన్ ఫ్యాక్చరింగ్ విభాగానికి 133 మందికి 3.5 కోట్లు, శ్రీనిధి ద్వారా 98.5 కోట్ల రుణాలు అందజేశామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఐదు లక్షల వ్యక్తిగత రుణాలుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఇంకా రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీసీలు పాల్గొన్నారు.

## ఆవు పాల సేకరణ ధరలు పెంచాలి

**ప్రజాశక్తి - చీడికాడ:**ఎండనక వాననక శ్రమించి పశువులను పెంచి పాలు పోసిన రైతులకు మొండి చేయి చూపించడం ఎంతవరకు సబవని మాజీ సర్పంచ్ నానాజీ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అడవిల అగ్రహారం గ్రామంలో విశాఖ డైరీ యాజమాన్యం పాల సేకరణ రేట్లు తగ్గించడంపై గ్రామ రైతులతో పాల సంఘం ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు రోజంతా శ్రమించి ఎండ వానలో వారి కాయ కష్టాన్ని శ్రమగా పెట్టి పశువులను పెంచి పాలు పోస్తే విశాఖ డైరీ యాజమాన్యం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి పాల రేట్లు తగ్గించడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆవు పాల రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ డైరీ పశువుల దానా రేట్లును విపరీతంగా పెంచి రైతుల నడ్డి విరుస్తుందన్నారు. యాజమాన్యం తమ నిర్ణయాన్ని మార్చుకొని ఆవు పాలకు రేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఎస్ రాయవరం :**విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాలు ధర పెంచాలని, ఈనెల 29 న విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం (గాజువాక)లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్ అప్పలరాజు తెలిపారు. ఆదివారం మండలంలో ధర్మవరం గ్రామం పాలకేంద్రం వద్ద రైతులతో కలసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాడి రైతులు ఆరుగాలం కష్టపడి పాలు ఉత్పత్తి చేస్తున్నారని, పెరిగిన మేత, దాణా ఖర్చు లతో విశాఖ డెయిరీ రైతులకు ఇస్తున్న పాల సేకరణ ధర గిట్టుబాటు కాక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో పాల సేకరణ ధర పెంచి రైతులను ఆదుకోవాల్సిన విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధర తగ్గించడం సరైంది కాదన్నారు.

విశాఖ డెయిరీ యాజమాన్యం ఏక పక్షంగా ఈ నిర్ణయం తీసుకుని రైతులకు తీవ్రంగా అన్యాయం చేస్తుందన్నారు. ఆవు పాల ధరలు పెంచి యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టానికి తగ్గట్టు గా బోనస్ చెల్లించాలన్నారు. ఈ ధర్నాలో పాడిరైతులు పాల్గోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోపాడి రైతులు పి.శ్రీను, బి.నరసింగరావు, జీ.నాయుడు, కె.సూర్యనారాయణ, పి.నూకరాజు, ఏ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భారాలపై సిఐటియు ధర్నా

**ప్రజాశక్తి- చీడికాడ:**కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీఐటీయూ నేత ఆర్.దేముడు నాయుడు విమర్శించారు. విద్యుత్ భారాలను నిరశిస్తూ మండలంలోని చినకోణం గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే, బాదుడే బాదుడు కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆనాడు చంద్రబాబు నాయుడు, నాయకులు నిరసన చేపట్టడం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అదే విధంగా పన్నుల భారం ప్రజలపై మోపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినదానికి గంగిరెద్దుల తల ఊపడం ఏమిటని ప్రశ్నించారు. కుటుంబంలో ఉన్న మహిళలందరికీ నెలకి రూ.1500, రైతు పెట్టుబడి సాయం కింద 20 వేలు, మూడు గ్యాస్ సిలిండర్లు వంటి హామీలు ఏమయ్యాయన్నారు.ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేస్తామని, మెగా డీఎస్సీ, నిత్యావసర వస్తువులు ధరలు అందుబాటులో ఉంచుతామని కూటమి నేతలు పలికిన హామీలు ఏమి అయ్యాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి కుంబోయిన కన్నబాబు, గిరిజన సంఘం నాయకులు వి.రాము, వార్డ్ మెంబర్ నాగరాజు, చెల్లయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు సౌకర్యం లేక అవస్థలు



కొండల నడుమ నుండి సరుకులు రవాణా చేస్తున్న గిరిజనులు


**కొండకోనల గుండా రాకపోకలు**

**- గిరిజనులకు తప్పని వెతలు**

**ప్రజాశక్తి -అనంతగిరి:** మారుమూల గిరిజన గ్రామాలలో కనీసం రోడ్డు సౌకర్యాలు లేక గిరిజన ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోగులకు డోలి మోతలు తప్పలేదు. నిత్యావసర సరుకులు కాలి బాటన వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది.అనంతగిరి మండలం మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి నకులమామిడి గ్రామంలో ఈ దుస్థితి నెలకొంది. ఈ గ్రామంలో సుమారు 60 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. స్వాతంత్రం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా ఈ గ్రామానికి నేటి వరకు ఎటువంటి రోడ్డు సౌకర్యం లేదు. ఆరోగ్య సమస్యలు తలెత్తినా, ఇతర అత్యవసర పరిస్థితులలో నక్కులుమామిడి గ్రామం నుండి పందిరిమామిడి వరకు కిలోమీటర్ల దూరం ఎత్తయిన అటవీ ప్రాంతం కొండ కోనల నడుమ నుండి రాకపోకలు సాగిస్తున్నారు.గర్భిణిలు, బాలింతలు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు డోళ్లి మోతలు, ఇందిరమ్మ గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు సామాగ్రి రవాణాకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పందిరిమామిడి మెయిన్ రోడ్డు నుండి నక్కులవామిడి వరకు రోడ్డు సౌకర్యం కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# ఆధార్ అప్డేట్ కేంద్రాల ఏర్పాటు

**ప్రజాశక్తి -అనంతగిరి:**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆధార్ అప్డేట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఎంపీడీవో కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఈ అప్డేట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. బొర్రా, కాశీపట్నం, జీనబాడు, లంగపర్తి, అనంతగిరి, టోకూరు, గుమ్మకోట పంచాయతీ సచివాలయ కేంద్రాలలో ఆధార్ అప్డేట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వెంట తేవాలని సూచించారు



అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకటరమణ తదితరులు

## పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

**ప్రజాశక్తి - కొయ్యూరు :** జంతువులను వేటాడేందుకు అడవుల్లోనూ, పొలాల చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని కొయ్యూరు సీఐ పి.వెంకటరమణ, మంప ఎస్ఐ ఎస్.శంకరరావు హెచ్చరించారు. ఆదివారం రాజేంద్రపాలెం వారపుసంతను సీఐ, ఎస్ఐలు సందర్శించారు. సంతకు వచ్చిన పలు గ్రామాల గిరిజనులకు అవగాహన కల్పించారు. అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చడం చట్టరీత్యా నేరమన్నారు. వీటివల్ల మూగజీవాలకే కాకుండా మనుషులకు ప్రాణహాని జరుగుతుందన్నారు.

## ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలి

**- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు**

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ప్రభుత్వ ఆధీనంలో విద్య ఉండడం ద్వారానే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులు నిలబెట్టుకోగలమని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకొనే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఏర్పడిన యుటిఎఫ్ ప్రభుత్వ రంగ బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎన్నో పోరాటాలు సలిపిందని గుర్తుచేశారు. పాలక వర్గాల నిర్బంధాలను, కేసులను తట్టుకుని నిలబడిందని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాట మార్గాన్ని ఎంచుకుందన్నారు. పాలక వర్గాలు ఏవైనా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, ప్రజల పక్షాన నిలబడి వారి పోరాటాలకు అండగా నిలబడిన ప్రజా సంఘంగా పేరు తెచ్చుకుందన్నారు. పాలక వర్గాల విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీన పడిందని, దీనిని బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ బడిని బతికించుకోవడానికి బడి సమయం కంటే అదనంగా ఒక గంట పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభను సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపనలో జీవితాలను ఫణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలను స్మరించుకొంటూ భవిష్యత్ ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. సంఘం మరో రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ అన్ని యాజమాన్య ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ అగ్రభాగాన ఉందని తెలిపారు. ట్రైబల్, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. మహాసభల ప్రారంభ సూచకగా యుటిఎఫ్ జెండాను సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి ఆవిష్కరించారు. మహాసభలో గతంలో పనిచేసిన యుటిఎఫ్ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా**

**నాగేశ్వరరావు, అంబేద్కర్**

యుటిఎఫ్ విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలో విశాఖ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీలక్ష్మి వ్యవహరించారు. గౌరవాధ్యక్షులుగా అనకాపల్లి పైడిరాజు, సహధ్యక్షులుగా ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, ఉప్పాడ రాము, మహ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్, వంగా రామలక్ష్మి, టి.జగన్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎమ్.రవిబాబు, కౌన్సిలర్‌గా ఎస్ఎస్.నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

# విశాఖ డెయిరీ దొంగ దెబ్బ

**ఆవు పాల సేకరణ ధర రూ.3 తగ్గింపు**

**ఏడాదికి రూ.64.80 కోట్లు ఆదా**

**పాల కేంద్రాల్లో ధరల ప్రదర్శనలో గోప్యత**

**పాల రైతుల ఆగ్రహం**



గణపర్తిలో నిరసన తెలుపుతున్న పాడి రైతులు, రైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కె.కోటపాడు విలేకరి**

విశాఖ డెయిరీ దాదాపు 2.50 లక్షల మంది పాల రైతులను దొంగదెబ్బ కొట్టింది. పెరిగిన పశువుల దాణా ఖర్చులకు తగినట్లు పాల ధరను రైతులకు చెల్లించకుండా ఆవు పాల సేకరణ ధరను తగ్గించింది. ఆ సమాచారం రైతులకు తెలీకుండా దాచిపెట్టింది. వాస్తవానికి పాల ధరలు రైతుకు తెలిసేలా పాల కేంద్రాల వద్ద ప్రదర్శించాలి. ఆవు పాల ధర తగ్గించిన సమాచారం బయటకు తెలీకుండా ఈ నెల 16 నుంచి కొత్త ధరలు అమలు చేస్తోంది. ఆవు పాల ధర లీటర్‌కు మూడు రూపాయలు తగ్గించి, గేదె పాలు లీటర్‌కు మూడు రూపాయలు పెంచినట్లు రైతులు చెబుతున్నారు. డెయిరీ యాజమాన్యం మాత్రం తగ్గించిన ఆవుపాల ధర, పెంచిన గేదె పాల ధరను గోప్యంగా ఉంచుతోంది. ఆవు పాల సేకరణ ధరను తగ్గించడంతో విశాఖ డెయిరీకి ఏడాదికి రూ.64.80 కోట్లు ఆదా అవుతుంది.

ఒకవైపు విశాఖ డెయిరీ పశువుల దాణా ధర పెంచింది. మరోవైపు రైతుకు బోనస్ ఇవ్వకుండా దాటేసుకుంటూ వస్తోంది. వీటికి తోడు గుట్టుచప్పుడు కాకుండా పాలుపోసిన రైతు జేబు కొట్టే పనికి సిద్ధపడింది. ప్రతి రోజూ విశాఖ డెయిరీకి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 2.50 లక్షల మంది రైతులు 7.50 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు. డెయిరీ సేకరిస్తున్న పాలలో ఆవు పాలు ఆరు లక్షల లీటర్లు, గేదె పాలు లక్షన్నర లీటర్లు వున్నాయి.

ఆరు లక్షల లీటర్ల ఆవుపాలకు మూడు రూపాయలు తగ్గించడంతో రోజుకు 18 లక్షలు, నెలకు రూ.5.40 కోట్లు, ఏడాదికి రూ.64.80 కోట్లు డెయిరీకి మిగులుతోంది. లక్షన్నర లీటర్ల గేదె పాలకు లీటర్‌కు మూడు రూపాయలు చొప్పున పెంచడంతో రోజుకు రూ.4.50 లక్షలు, నెలకు రూ.1.35 కోట్లు, ఏడాదికి రూ.16.20 కోట్లు అదనంగా చెల్లించాల్సివుంటుంది. ఆవు పాలకు మూడు రూపాయలు తగ్గించడంతో ఆదా అయిన రూ.64.80 కోట్లలో గేదె పాలకు మూడు రూపాయలు చొప్పున పెంచిన ధరతో ఏడాదికి రూ.16.20 కోట్లు పోయినా ఇంకా యాజమాన్యానికి రూ.48.60 కోట్లు మిగులుతోంది. ఈ మిగులు నిధులతో పాల రైతుకు బకాయి బోనస్ చెల్లించాలన్న ఆలోచనలో యాజమాన్యం వున్నట్లు తెలుస్తోంది. తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డెయిరీ యాజమాన్యం రైతుకు బోనస్ చెల్లించి ఆ అప్రతిష్టను తొలగించుకోవాలని చూస్తోంది. ఆవు పాల ధర తగ్గించడంతో పాల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ డెయిరీ పాల ధరలు తక్కువగా వుండడంతో ప్రయివేటు డెయిరీల వైపు పాల రైతులు మొగ్గు చూపుతున్నారు. విశాఖ డెయిరీకి రోజుకు 20 లీటర్ల ఆవుపాలు పోసిన మునగపాకకు చెందిన దాడి వీరబాబు 60 రూపాయలు నష్టపోతున్నట్లు తెలిపాడు. దీంతో విశాఖ డెయిరీకి పాలుపోయడం మానేసి ప్రయివేటు డెయిరీకి పాలు పోస్తున్నట్లు చెప్పాడు. విశాఖ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌వి.రమణ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ పాల రైతుకు బోనస్ చెల్లించేందుకు ఆవు పాల ధరను సొసైటీలు తగ్గించాయని తెలిపారు. తగ్గించిన పాల ధరతో వచ్చిన ఆదాయాన్ని బోనస్ కింద సొసైటీలు చెల్లిస్తాయన్నారు. ఆవు పాల ధరను డెయిరీ తగ్గించలేదని తెలిపారు.

**పాత ధర చెల్లించాలి**



విశాఖ డెయిరీకి రోజుకు 12 లీటర్లు ఆవు పాలు పోస్తున్నాను. మూడు రూపాయలు తగ్గించడంతో 36 రూపాయలు నష్టపోతున్నాను. తవుడు, నూకలు, విశాఖ డెయిరీ సరఫరా చేస్తున్న దాణా రేట్లు పెరిగాయి. కానీ పాల ధర పెంచలేదు సరికదా తగ్గించడం అన్యాయం. పాత ధర చెల్లించాలి.

**శిలపరశెట్టి ముసలినాయుడు,**
**చౌడువాడ, పాల సొసైటీ మాజీ డైరెక్టర్**

**ధర పునరుద్ధరించకపోతే ఆందోళన**



తగ్గించిన ఆవు పాల ధరను పునరుద్ధరించి రైతుకు చెల్లించాలి. బోనస్ పాల రైతులందరికీ ఇవ్వాలి. ఇతర డెయిరీల కంటే ఎక్కువ ధర చెల్లించి పాల రైతును విశాఖ డెయిరీ ప్రోత్సహించాలి. దాణా ధరలు తగ్గించాలి. పాల రైతుకు పాత ధరల ప్రకారం బిల్లులు చెల్లించకపోతే ఆందోళన చేపడతాం.

**కర్రి అప్పారావు,**
**ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు**

# కనకమహాలక్ష్మి బ్యాంకుకు మూడు అవార్డులు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు బ్యాంకింగ్ ఫ్రంటిరియర్స్ నిర్వహించిన అవార్డుల ఉత్సవంలో మూడు విభాగాలలో ఉత్తమ నిర్వహణ అవార్డులు లభించాయి. ఇటీవల లక్నోలో నిర్వహించిన బ్యాంకింగ్ ఫ్రంటిరియర్స్ ఎన్‌సిబిఎస్ అండ్ ఎఫ్‌సిబిఎ కాన్ఫరెన్స్ -2024లో ఈ అవార్డులను బ్యాంకు అధికారులు వీరేంద్రప్రసాద్, సాయిచరణ్ అందుకున్నారు. ఉత్తమ సైబర్ సెక్యూరిటీ, ఉత్తమ క్రెడిట్ ఇనిషియేటివ్, ఉత్తమ వార్షిక రిపోర్టు విభాగాలలో ఈ అవార్డులు లభించాయి. అవార్డులు లభించడం వెనుక పాలకవర్గం సహకారం, సిబ్బంది కృషి ఎంతో ఉందని బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు. బ్యాంకుకు కొన్నేళ్లుగా వరుసగా ప్రతి సంవత్సరం బ్యాంకింగ్ ఫ్రంటిరియర్స్ అవార్డులు లభించడం సంతోషంగా ఉందని బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్ అన్నారు. పాలకవర్గం సహకారంతో, సిబ్బంది కృషితో రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 32 శాఖలతో ఖాతాదారులకు సత్వర సేవలందిస్తున్న తమ బ్యాంకు రానున్న రోజుల్లో నగరంలోని విశాలాక్షినగర్ మెయిన్ రోడ్డులో నూతన శాఖతో పాటు మరిన్ని శాఖలను ప్రారంభించనున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు.



పెబ్బంపల్లిలో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సత్యవతి

## పలు గ్రామాల్లో 'పల్లె పండగ'

**ప్రజాశక్తి -సీలేరు:** జీకే వీధి మండలం ఎ.ధారకొండ పంచాయతీ పెబ్బంపల్లి గ్రామంలో సర్పంచ్ ముర్ల. సత్యవతి అధ్యక్షతన పల్లెపండుగ పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో ప్రతికుటుంబానికి వందరోజుల పని కల్పిస్తామన్నారు. అలాగే ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఉపాధి జాబ్‌కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్ఇజిఎస్ ఇసి అప్పలనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ సింహాచలం, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శాంతి, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కోటికిరణ్, వార్డు సభ్యులు కొండబాబు, కృష్ణ, కాసులమ్మ పాల్గొన్నారు.

**పల్లె పండగకు అడ్డుపడడం సరికాదు**

సీలేరు మేజరు పంచాయతీ చింతపల్లి క్యాంప్‌లో ఆదివారం పల్లె పండగ కార్యక్రమాన్ని కూటమి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించి, రచ్చబండను ప్రారంభించామని స్థానిక సర్పంచ్ దుర్జో వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చింతపల్లి క్యాంపులో దిగువ, ఎగువ వీధుల మధ్య గొడవలు సృష్టించి, కొందరు కూటమి నాయకులు అడ్డుకోవాలని చూడడం సరికాదన్నారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది కూటమి నాయకులు పల్లె పండుగ కార్యక్రమాన్ని ముందుకు కొనసాగనివ్వకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు బొర్రా కృష్ణ నక్క. తిరుమలరావు, టౌన్ అధ్యక్షుడు కె.సన్యాసిరావు, బిజెపి నాయకులు కె.అప్పలరాజు, కాంగ్రెస్ నాయకులు కారే. శ్రీనివాస్, వార్డు సభ్యులు పాపారావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, మహిళా పోలీస్ రేవతి, వెటర్నరీ అసిస్టెంట్ అనుష్క, డిజిటల్ అసిస్టెంట్ విజయ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ మహిళా కళాశాలలో జాబ్ మేళా

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నామని ఆ విభాగం జిల్లా అధికారి చాముండేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేళాలో శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఇన్నోసోర్స్, ఎస్‌బిఐ కార్డ్స్, డీ-మార్ట్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966965502 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## విశాఖపట్నం - రాయపూర్ రైలు వేళలు మార్పు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఇటీవల విశాఖపట్నంలో జరిగిన వాల్తేర్ డివిజన్ డివిజనల్ కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు చేసిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్ ప్రయాణికుల అవసరాల దృష్ట్యా విశాఖపట్నం - రాయపూర్ పాసింజర్ రైలుకు సమయాలు సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 20 నుంచి అమలులోకి రానున్నాయి. సవరించిన సమయాల ప్రకారం 08528 విశాఖపట్నం - రాయపూర్ పాసింజర్ రైలు ఉదయం 6.30 గంటలకు బదులు 4.25 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి సింహాచలానికి 4.43కి, కొత్తవలసకు 5.05కి, విజయనగరానికి 5.50కి, బొబ్బిలికి 7.08కి, పార్వతీపురానికి 7.40కి, పార్వతీపురం టౌన్‌కి 7.48కి, రాయగడకు 9.15కి, మహసముండ్‌కు 17.00కి, రాయపూర్‌కు రాత్రి 19.45 గంటలకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు.